# కథప్రేమ

**- గుండాన జోగారావు**



ఐదు గంటలకు ఆఫీసునుండి బయల్దేరిన రఘువర్మ, దినచర్యలో భాగంగా ఫుట్‌పాత్ మీద నడుస్తూ అక్కడ ఒక గంటసేపు గడపటం మామూలే. ఫుట్‌పాత్‌పై రకరకాల పాత పుస్తకాలు... రఘువర్మకు పుస్తకాలంటే పిచ్చి అభిమానం... దానికి తోడు అడపాతడపా వివిధ పత్రికల్లో ప్రచురితమైన ముప్ఫయి వరకు కథలు అతన్నొక రచయితగా ముద్రవేశాయి. రచయిత అన్నవాడు ఎక్కువగా చదవాలి... తక్కువగా రాయాలి... సూక్ష్మంలో చెప్పాలంటే ఒక ఉత్తమ పాఠకుడు కావాలన్న విషయంతో ఏకీభవిస్తాడు కాబట్టి కనిపించే ప్రతి పుస్తకం చదువుతాడు. ఏ పుస్తకంలో ఏచమక్కుందో...

అప్రయత్నంగా రఘువర్మ కళ్ళు కథా సంపుటిపై పడ్డాయి. ఎలాగైనా స్వంతం చేసుకోవాలి...

"ఎంత?" అడిగాడు రఘువర్మ

"యాభై పుస్తకం ముఫ్ఫై ఇవ్వండిసాబ్... ఫ్రెష్ బుక్కు" లెక్చరిస్తున్నాడు సెకెండ్‌హాండ్ బుక్‌స్టాల్ వాడు. రఘువర్మ జేబులో అంతా కలుపుకుంటే పాతిక రూపాయలవ్వచ్చు.

"ఇరవై ఇస్తాను"

"నక్కో సాబ్"

చిల్లరతో సహా అంతా ఊడ్చేసి ఇచ్చి పుస్తకం దక్కించుకున్నాడు రఘువర్మ.

హమ్మయ్య... ఊపిరి పీల్చుకున్నాడు అయితే ఇప్పుడు ఇంటికి వెళ్ళాలంటే... జేబులు ఖాళీ.

ఆటోలో ఇంటికి వెళ్ళి శ్రీమతిని ఛార్జీలు అడిగితే?...

"నిన్నే యాభై యిచ్చాను.... అప్పుడే అయిపోయా యేమిటి?... నెలాఖరు రోజులన్న కనీస జ్ఞానం కూడా మీకు లేకుండా పోయిందా?" అంటూ రయ్యిమని ఎగిరి మర్నాడు ఆఫీసుకు బయల్దేరేవరకు గొణుగుతూనే వుంటుంది...

వెధవ తలనొప్పి... లెఫ్టరైట్ కొట్టేస్తేనో...

ఇంటి దూరం తక్కువ కాదు. కనీసం అయిదు కిలోమీటర్లు... తప్పదు మరి. ఆశించింది దక్కించుకోవాలంటే కష్టపడాలి.

నడక ప్రారంభించాడు... రెండు గంటలసేపు నడిచి ఇంటికి చేరుకున్నాడు.

"ఇంత ఆలస్యమయిందేం?" నీళ్ళగ్లాసు అందిస్తూ శ్రీమతి ప్రశ్న.

"బాల్య మిత్రుడొకడు కలిసాడు... మాట్లాడుతూ వుంటే అస్సలు టైం తెలియలేదు" కుంటిసాకు సమాధానంగా చెప్పాడు రఘువర్మ.

వంట గదిలోకి శ్రీమతి వెళ్ళడం చూసి తన బ్యాగ్‌లోనుండి తీసాడు ఫుట్‌పాత్‌మీద కొన్న కథా సంపుటి. ఆప్యాయంగా దాన్ని నిమిరాడు రఘువర్మ. అది ఏడాది క్రితం కోపరేటివ్ బ్యాంక్ లోన్‌పెట్టి తాను అచ్చువేసిన తన కథాసంపుటి.

**ఒక సాహితీ మిత్రునికి అభినందనలతో అందించిన ప్రతి అది...!★**